మెడికల్ ఎడ్యుకేషనల్ హబ్‌గా రామగుండం

నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్
- నర్సింగ్ కళాశాల ప్రారంభం

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 2: రానున్న రోజుల్లో సిమ్స్ వైద్య కళాశాలలో పీజీ వైద్యవిద్య, డెంటల్ కళాశాలను ఏర్పాటు చేసి రామగుండాన్ని మెడికల్ ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సిమ్స్ వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో పారా మెడికల్, నర్సింగ్ కళాశాలను ప్రారంభించారు. రానున్న రోజుల్లో వైద్య విద్యార్థుల కోసం ధర్మాసుపత్రి, సిమ్స్ కళాశాల మధ్య స్కైవ్‌ను ఏర్పాటు చేస్తానని తెలిపారు. నర్సింగ్ కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి రూ. 2.26కోట్లు మంజూరయ్యాయయని, ఈ నెల 4న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

మైత్రి క్లినిక్ ప్రారంభం

గోదావరిఖని ప్రభుత్వ దవాఖానలో ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. రామగుండం ప్రాంతంలో 57మంది ట్రాన్స్‌జెండర్లకు ఇండ్ల స్థలాలు అందిస్తామన్నారు. ట్రాన్స్‌జెండర్లు ఎమ్మెల్యేను సన్మానించారు. ఇక్కడ సిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్, సూపరిండెంటెంట్ డాక్టర్ దయాల్‌సింగ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసూన, వైఎస్ ప్రిన్సిపాల్ సుశీల, రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌వో అన్నప్రసన్న, డీడబ్ల్యూ వేణుగోపాల్, ఎఫ్ఆర్ఆర్ స్వర్ణలత, సీడీపీఓ అలేఖ్య పటేల్, కాంగ్రెస్ నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, ఉన్నారు.

హామీలు ఎగ్గొట్టిన సీఎంను ప్రశ్నించాలి

మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్

జూలపల్లి, డిసెంబర్ 2 : ఏడాది క్రితం అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ లిచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించడానికి రైతులు, రైతు కూలీలు, నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, ఆటో డ్రైవర్లు సిద్ధం కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బుధవారం పెద్దపల్లిలో నిర్వహించనున్న 'యువ వికాసం' బహిరంగ సభకు వస్తున్న అబద్దాల రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలన్నారు. అధికారం దక్కించుకోడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజల్ని మభ్యపెట్టి 420 హామీలు ఇచ్చిందని విమర్శించారు. హామీలు ఎందుకు అమలు చేయడం లేదో సీఎం వివరణ ఇచ్చి జిల్లాలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. ఏడాది గడిచినా ఇచ్చిన మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంది చొక్కారెడ్డి, మాజీ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, నాయకులు పొలగాని సతీశ్, కన్నం రమేశ్, చొప్పరి శేఖర్, పూరెల్ల గంగయ్య, లక్కాకుల శ్రీనివాస్, నారగోని శంకరయ్య, ర్యాకం భాస్కర్, మెండె ఓదెలు, కొత్త శ్రీధర్, తొంటి రాజేశం, రేశవేని మల్లేశం పాల్గొన్నారు.

మహా పాదయాత్రికుడికి ఘన స్వాగతం

రామగిరి, డిసెంబర్ 2: అయ్యప్ప మాల ధరించి 48 రోజుల పాటు మహా పాదయాత్ర ద్వారా అయ్యప్పను దర్శించుకుని వచ్చిన రత్నాపూర్ మాజీ ఎంపీటీసీ ధర్మల రాజ సంపత్‌కు గ్రామస్తులు, అయ్యప్ప దీక్షాపరులు సోమవారం ఘన స్వాగతం పలికారు. ముందుగా మారుతి నగర్ హనుమాన్ దేవాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సంపత్‌ను సత్కరించారు. అనంతరం సెంటినరీకాలనీ మీదుగా రత్నాపూర్ రామాలయం వరకు ర్యాలీగా బయలుదేరగా గ్రామస్తులు స్వాగతం పలికారు. రామయంలో ప్రత్యేక పూజల అనంతరం బీఆర్ఎస్ నాయకులు ఆయనను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేసి రవీందర్, నాయకులు మేదరవేన కుమార్, పట్టణ అధ్యక్షుడు భాస్కర్, మాజీ సర్పంచ్ ప్రతిమా పీవీ రావు, నాయకులు స్టాలిన్, అశోక్, రాజన్న, ఉదయ్, కుమారస్వామి, ప్రశాంత్, మల్లయ్య, రొడ్డ శ్రీనివాస్, రాజు, తిరుపతి, సతీశ్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట యువతి బైఠాయింపు

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన యువతి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 2: నాలుగేళ్లుగా ప్రేమించి, పెళ్లి చేసుకోవాలని అడిగితే తప్పించుకుంటున్నాంటూ ఓ యువతి ప్రియుడి ఇంటి ముందు బైఠాయించింది. ఈ సంఘటన కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారంలో సోమవారం జరిగింది. యువతి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూనారం గ్రామానికి చెందిన జంగిటి అనిల్ తనను నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నాడని, పెండ్లి చేసుకోవాని కోరితే నిరాకరిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన దాసరి ప్రత్యూష అతని ఇంటి ముందు బైఠాయించింది. అనిల్ తో వివాహం జరిపించాలని డిమాండ్ చేసింది. ప్రత్యూషకు స్థానిక మహిళలు మద్దతుగా నిలిచారు. ఆమెకు న్యాయం జరిగే దాకా పోరాడతామని మహిళా సంఘాల నాయకులు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

రామగిరి, డిసెంబర్ 2 :విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో శైలజారాణి సూచించారు. మండల వైద్యాధికారి ప్రదీప్‌తో కలిసి పన్నూరులోని కేజీబీవీ పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారి వెంట హెల్త్ అసిస్టెంట్ భరత్, కార్యదర్శి ప్రేమలత ఉన్నారు.

హామీలు అమలు చేయాలి

గోదావరిఖని, డిసెంబర్ 2: గత ఎన్నికల సందర్భంగా సింగరేణి ప్రాంతాల్లో పర్యటనతో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. సింగరేణి పరిరక్షణకు, కొత్త బావుల కోసం ఇచ్చిన హామీల ప్రయత్నం ఏమేరకు చేశారో సీఎం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు, టీ శ్రీనివాస్, రాజేందర్, హెచ్ఎంఎస్ నాయకులు ఎడ్ల రామచందర్, జీ రాములు, జైపాల్, నాయకులు ఐ కృష్ణ, ఈ నరేశ్, ఎం రాయమల్లు, గుండేటి మల్లేశం, ఎం దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, ప్రసాద్, పీ మొండయ్య, శేఖర్, రాయపోశం, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో భద్రత కరువు

కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు

- పారుపల్లి సెంటర్‌లో వడ్లు చోరీ
- రైతుల ఆందోళన

ముత్తారం, డిసెంబర్ 2: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే, అక్కడ ధాన్యం దొంగల పాలవుతున్నది. మండలంలోని పారుపల్లి సెంటర్‌లో వడ్లు చోరీకి గురైన ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొందరు రైతులు 20 రోజుల క్రితం తాము పండించిన వడ్లను గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తరలించారు. సుమారు10 మంది రైతుల వడ్ల కుప్పల నుంచి ధాన్యం ఎత్తుకెళ్లినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఆదివారం వర్షం సూచనలు కనిపించడంతో రైతులు వడ్లు కుప్పపోసి టార్పాలిన్లు కప్పి వెళ్లారు. సోమవారం ఉదయం పరదాలు తీసి చూడగా, వడ్లు చోరీ అయిన ఆనవాళ్లు కనిపించడంతో రైతులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. గతంతోనూ ఇలాగే జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రం వద్ద నైట్ వాచ్‌మెన్, సీసీ కెమరాలు లేకపోవడం దొంగలకు కలిసి వచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు. ఊరికి దూరంగా ఓ గుట్టపై కొనుగోలు కేంద్రం ఉండడంతో అడవి పందులు సంచరిస్తున్నాయని, నైట్ వాచ్‌మెన్ కూడా ఉండడం లేదని పీఏసీఎస్ అధికారులు చెబుతున్నారు . కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు పరిశీలించారు.

8 బస్తాల వడ్లు పోయినయ్..

నేను 4. 20 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న. 15 రోజుల క్రితం పోలం కోసి కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసిన. ఆదివారం వర్షం పడుతుందని వడ్లు కుప్ప చేసి, పరదాలు కప్పి ఇంటికి పోయిన. సోమవారం పొద్దున వచ్చి చూసే సరికి వడ్ల కుప్ప కుంగినట్లు ఉంది. పరదాలు తీసి చూస్తే దాదాపు 8 బస్తాల వడ్లు పోయినట్లు ఉంది. కౌలు తీసుకొని, అప్పుచేసి కష్టపడి పంట పండిస్తే వడ్లు దొంగలు ఎత్తుకపోయింద్రు. దొంగలను దొరక బట్టి రైతులకు న్యాయం చేయాలి.

- భూషణవేన లక్ష్మణ్, రైతు

నేడు సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లి, డిసెంబర్2: వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం ఈనెల 3న ఉదయం 11.35 గంటల నుంచి మీ- సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్డీవో ఆర్ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరం క్యాంపులు ఈ నెల 5, 19న పెద్దపల్లి జిల్లా దవాఖానలో, 12, 27న గోదావరిఖని జనరల్ దవాఖానలో ఉంటాయని వివరించారు. పెద్దపల్లి జనరల్ దవాఖనాలో ఈనెల 5న శారీరక వైకల్యం, బుద్ధి మాం ధ్యం వారికి, 19న దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్న వారికి వైద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. గోదావరిఖని జనరల్ దవాఖానలో 12న శారీరక వైకల్యం, బుద్ధి మాంధ్యం వారికి, 27న దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్న వారికి పరీక్షలు ఉంటాయని వివరించారు. క్యాంపులకు వచ్చే సమయంలో దరఖాస్తుదారులు మీసేవా సదరం స్లాట్ బుకింగ్ రసీదుతో పాటు వైకల్య పరీక్షా కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్ట్‌లు తీసుకు రావాలని సూచించారు.

సమస్యలు తీర్చాలి

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 2: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న కార్మికులు జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇక్కడ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

బజార్‌బంద్‌ను జయప్రదం చేయాలి

బజార్ బంద్‌ను విజయవంతం చేయాలని చిరువ్యాపారులను కోరుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటిం చందర్

గోదావరిఖని, డిసెంబర్ 2: గోదావరిఖని, ఎన్టీపీసీలో రోడ్డు వెడల్పుతో కూల్చివేతలకు గురి అయ్యే చిరువ్యాపార సంస్థలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చేపట్టనున్న బజార్ బంద్ను ను జయప్రదం చేయాలని రామగుండం మాజీ ఎమ్మల్యే కోరుకంటి చందర్ కోరారు. సోమవారం స్థానిక లక్ష్మీనగర్‌లో చిరువ్యాపారులను కలిసి బంద్‌కు సహకరించాని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ మున్సిపల్ కార్పొరేటర్లు గాదం విజయ, జనగామ కవిత సరోజిని, బాదె అంజలిదేవి, బీఆర్ఎస్ నాయకులు మూల విజయారెడ్డి, చల్లా రవీందర్‌రెడ్డి, నారాయణ దాసు మారుతి, సట్టు శ్రీనివాస్, జడ్సన్, తిమోతి, శ్రావణ్, చింటూ, ముద్దసాని సంధ్యారెడ్డి, వెంకటేశ్, స్వప్న, రాము ఉన్నారు.

ఎస్సీ గురుకుల హాస్టల్‌లో సమస్యల తిష్ట

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 2: బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర కళాశాల సంక్షేమ వసతి గృహాన్ని సోమవారం సందర్శించారు. విద్యార్థులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ వసతి గృహంలో పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. ఈ విషయమై పలు మార్లు జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. నెల క్రితం కలెక్టర్ కోయ శ్రీహర్ష స్వయంగా హాస్టల్‌ను పరిశీలించినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని మండిపడ్డారు.బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, జిల్లా కో ఆర్డినేటర్ కొయ్యడ సతీశ్ గౌడ్, బీఆర్ఎస్వీ నాయకులు రాజోజుల శివ కుమార్, లవన్‌కుమార్, ఉప్పు శివకుమార్‌పటేల్, బండి సురేశ్, సురేందర్, అవినాష్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్వీ నాయకులు

జిల్లాకు కొత్త పోలీస్ స్టేషన్లు మంజూరు

పెద్దపల్లి, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ)/జూలపల్లి: పెద్దపల్లి జిల్లాకు కొత్త పోలీసు స్టేషన్లు మంజూరు చేస్తూ హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం జీవోలు విడుదలయ్యాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్ స్టేషన్, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్, పెద్దపల్లి టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఎలిగేడు మండలానికి పోలీస్ స్టేషన్ మంజూరయ్యాయి. ఉమ్మడి జూలపల్లి మండలం నుంచి 2001లో ఎలిగేడును అప్పటి ప్రభుత్వం ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి దాదాపు 23 ఏండ్ల నుంచి జూలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటి దాకా కొనసాగింది. మండలంలోని 12 పంచాయతీల్లో 25 వేల దాకా జనాభా ఉంటుంది. ఎలిగేడు మండల ప్రజలు 20 కిలోమీటర్ల దూరం నుంచి జూలపల్లికి రావడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఏండ్ల తరబడి ఎలిగేడు మండల ప్రజలు పోలీస్ స్టేషన్ నెలకొల్పాలని ఆందోళన బాట పట్టారు. ఎట్టకేలకు ఠాణా మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం అవుతున్నది.

సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు పాన్ సీడ్స్ విరాళం

విరాళం అందిస్తున్న పాన్ సీడ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

ముత్తారం, డిసెంబర్ 2: అడవిశ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్‌లో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు కోసం పాన్ సీడ్స్ ఫౌండేషన్ రూ. 1.50 లక్షలు విరాళం అందజేసినట్లు హెచ్ఎం ఇరుగురాల ఓదెలు తెలిపారు. ఇక్కడ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ చిగురు స్రవంతి, పాన్ సీడ్స్ ఫౌండేషన్ ప్రతినిధి తరుణ్ రెడ్డి, ఆర్గనైజర్లు శంకర్, చిగురు విద్యాసాగర్, ఉపాధ్యాయులు మహిపాల్ రెడ్డి, నర్సింహారెడ్డి, సునీత, సతీశ్ కుమార్, విజయ్ కుమార్, ఉషారాణి, శంకర్, రుబీనా, రమేశ్ పాల్గొన్నారు.

జీవన ప్రమాణ పత్రం అందజేయాలి

రామగిరి, డిసెంబర్ 2: రిటైర్డ్ ఉద్యోగులు సమీపంలోని మీ సేవా కేంద్రంలో జీవన ప్రమాణ పత్రం అందజేయాలని ఆర్జీ-3, ఏపీఏ పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం ప్రకటనలో తెలిపారు. కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం కింద పింఛన్ పొందుతున్న వారు, కాంట్రిబ్యూటరీ పోస్టు రిటైర్మెంట్ మెడికేర్ స్కీం కింద వైద్య సేవలు పొందుతున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు తప్పనిసరిగా ఈ పత్రం అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.

యాసంగి పంటలకు సాగు నీరందించాలి

ముత్తారం, డిసెంబర్ 2: యాసంగి పంటలకు సాగునీరు అందించి ఈ ప్రాంత రైతులును ఆదుకోవాలని మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు నుంచి గుండారం రిజర్వాయర్ ద్వారా మండలంలోని శుక్రవారంపేట్‌లోని చింతల చెరువులోకి సాగునీరు విడుదల చేయాలని కోరారు. మండలంలోని చివరి ఆయకట్టు వరకు నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని విన్నవించారు.

సూచనలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

అంతరాయం ఉండొద్దు

పెద్దపల్లి, డిసెంబర్2: సీఎం బహిరంగా సభలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. సభా ప్రాంగణం వద్ద విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 4న ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం (రంగంపల్లి సబ్ స్టేషన్ సమీపంలో) వద్ద విద్యుత్ సరఫరా ఏర్పాట్లను టీజీఎన్పీడీసీఎల్ ఎండీ వరుణ్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సోమవారం పర్యవేక్షించారు. సీఎం పర్యటన సందర్భంగా సభాస్థలి వద్ద పార్కింగ్ సదుపాయాలను పరిశీలించారు. ఇక్కడ పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, ఆర్ అండ్ బీ ఈఈ భావ్ సింగ్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, తహసీల్దార్ రాజ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లా దవాఖానలో మెరుగైన వైద్య సేవలు

పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ దవాఖానలో వైద్య సేవలు గణనీయంగా పెరిగాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విభాగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. గత నెలలో జిల్లా దవాఖానలో 10, 539 ఔట్ పేషెంట్లు, 1289 మంది ఇన్ పేషెంట్లు సేవలు పొందారని వెల్లడించారు. కంటి శస్త్ర చికిత్సలు నవంబర్ 22న ప్రారంభించామని, ఇప్పటి వరకు 18 మందికి ఆపరేషన్లు చేసినట్లు వివరించారు. ఎంసీహెచ్‌వో 5,088 మంది ఔట్ పేషెంట్లు, 667 మంది ఇన్ పేషెంట్లు సేవలు పొందారని, నవంబర్‌లో 210 ప్రసవాలు జరిగినట్లు వెల్లడించారు. ప్రభుత్వ దవాఖాన సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మంథని రూరల్, డిసెంబర్2: మంథని కేడీసీసీ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత - నగదు రహిత లావాదేవీలపై పుట్టపాక గ్రామంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలు, ఇతర స్కీములను మేనేజర్ ఉదయశ్రీ వివరించారు. ప్రతి ఒక్కరూ నగదు రహిత లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సూచించారు. సూరయ్యపల్లి, కాకర్లపల్లి, ఎక్లాస్‌పూర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు దిలీప్, పోతరాజు సతీశ్, బూడిద వసంత, సిబ్బంది మహేందర్, అమరేందర్, రమేశ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు యువ వికాసం సభ

పెద్దపల్లి, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): ఈ నెల 4న పెద్దపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువ వికాసం సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి నిరుద్యోగ విజయోత్సవ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విజయరమణారావు మాట్లాడారు. ఈ సభలో గ్రూప్-4తో పాటు వివిధ పరీక్షల్లో ఎంపికైన 9వేల మంది అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై సీపీ సమీక్ష

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 2: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనను పురస్కరించుకొని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం కమిషనరేట్ పరిధి పోలీసులు ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, వీఐపీల మార్గాలు, సభకు వచ్చే ప్రజల సౌకర్యంపై వివిధ శాఖల సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఫైర్ సర్వీస్ గురించి, బందోబస్తుపై విధులకు సంబంధించి డ్యూటీ చార్ట్ కేటాయింపు, స్పెషల్ టీమ్‌ల ఏర్పాట్లు అంశాలపై అధికారులతో చర్చించి ఆదేశాలు జారీ చేశారు. డీసీపీలు చేతన, భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు రమేశ్, కృష్ణ, ప్రకాశ్, వెంకటేశ్వర్లు, రవికుమార్, వెంకటస్వామి, నరసింహులు, సుందర్‌రావు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

కల్వచర్ల రైతుకు మిలియనీర్ పురస్కారం

పురస్కారం అందుకుంటున్న కల్వచర్ల గ్రామ రైతు వెంకటేశ్వర్లు

రామగిరి, డిసెంబర్ 2: కల్వచర్ల రైతు వేముల వెంకటేశ్వర్లు మిలీయనీర్ పురస్కారం అందుకున్నారు. ఆదర్శ రైతుగా గుర్తింపు పొంది సోమవారం ఢిల్లీలోని పూసాలో జరిగిన కిసాన్ మేళాలో ఈ పురస్కారం అందుకున్నారు. రాష్ట్రం నుంచి మొత్తం 12 మంది రైతులు ఎంపిక కాగా, పెద్దపల్లి జిల్లా నుంచి వెంకటేశ్వర్లు ఒక్కరే ఈ అవార్డు అందుకున్నారు. జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ, జాతీయ వ్యవసాయ మాస పత్రిక, కృషి జాగరణ సంయుక్తంగా మిలియనీర్ పురస్కారాలకు ఎంపిక చేశారు. జిల్లాలోనే మొదటి ఆదర్శ రైతుగా నిలిచిన వెంకటేశ్వర్లును పలువురు అభినందించారు.

మారుపేర్ల సమస్యను పరిష్కరించండి

గోదావరిఖని, డిసెంబర్ 2: సింగరేణిలో మారుపేర్ల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను మారుపేర్ల బాధితులు కోరారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. బుధవారం పెద్దపల్లికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి తమ సమస్యలు విన్నవిస్తామని తెలిపారు. వాటిని పరిష్కారించాలని ఎమ్మెల్యే, ఐఎన్టీయూసీ నేత జనక్‌ప్రసాద్‌ను కోరారు. ఇక్కడ మారుపేర్ల బాధితులు లక్క శ్రావణ్‌గౌడ్, తిరుమల శ్రీనివాస్, పర్తపల్లి హరీశ్, పొన్నం వెంకటేశ్, బొమ్మక కార్తిక్, ఈర్ల రాజయ్య, బొద్దుల రంజిత్, జిల్లాల శ్రావణ్, ప్రదీప్, పుట్ట సత్యం, గజ్జల వెంకటి, రమేశ్ ఉన్నారు.

సీఎంకు సింగరేణి సమస్యలు విన్నవిస్తాం

గోదావరిఖని, డిసెంబర్ 2: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సింగరేణి కార్మికుల సమస్యలను సీఎంను విన్నవిస్తామని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహామండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఇక్కడ ఐఎన్టీయూసీ నాయకులు ఉన్నారు.

'కళా ఉజ్వల'కు శ్రీకారం

కోల్‌సిటీ, డిసెంబర్ 2: గోదావరిఖనికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ కూడిపూడి నృత్యకళాకారిణి గుమ్మడి ఉజ్వల బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేటి తరం పిల్లలకు, భావి తరాలకు భారతీయ శాస్త్రీయ, లలితా కళలను పరిచయం చేయాలని భావించి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నృత్యఖని ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో 'కళా ఉజ్వల' కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకునే పేద పిల్లలకు ఈ శాస్త్రీయ విద్యపై అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇచ్చి బృంద నాట్యం అనంతరం సర్టిఫ